# సాక్షి
# వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 7 । ఆగస్టు । 2023






### పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి మృతి

కడపలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న కప్పా రాజు (45) అనే వ్యక్తి ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. -8లో



### చంద్రబాబును మొదటి ముద్దాయిగా చేర్చాలి

పుంగనూరులో జరిగిన సంఘటనలో చంద్రబాబు నాయుడును మొదటి ముద్దాయిగా చేర్చాలని ఎమ్మెల్యే రాచమల్లు అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.2/27.1

### వాతావరణం

జిల్లాలో ఆదివారం 27.1 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### దూదేకులు రాజకీయంగా ఎదగాలి



సంఘసేవకులకు సన్మానపత్రం అందజేస్తున్న బాదుల్లా

కడప కోటిరెడ్డిసర్కిల్: దూదేకులు రాజకీయంగా ఎదిగినప్పుడు మాత్రమే సామాజిక గుర్తింపు గౌరవం లభిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గంలో దూదేకులు ఎక్కువగా ఉన్నారన్నారు. షాదితోఫా పథకాన్ని దూదేకులకు వర్తింపచేయడానికి కృషి చేశామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు చెంద్రాయుడు,కుళాయప్ప, మహిళా నాయకులు రజియాబేగం, సజీనా తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆదివారం కడపలోని సీఎస్ఐ స్కూల్‌లో సీనియర్ హెచ్ఎం ఎస్ఎండీ జాఫర్ పర్యవేక్షణలో నిర్వహించారు ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధానోపాధ్యాయు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం హెచ్ఎం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్లుగా రాజశేఖర్, శ్రీనివాసులరెడ్డి, నాగాంజనేయులు, పెంచలయ్య, సహాధ్యక్షులుగా అపర్ణ, బాల అంకిరెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణ, సహ కార్యదర్శులుగా జాఫర్, ప్రతాప్ రెడ్డి, రామక్రిష్ణయ్య, ఇమాం హుస్సేన్, హెడ్‌క్వార్టర్ కార్యదర్శిగా టీవీ రమణయ్య, మహిళా కార్యదర్శులుగా రత్నాదేవి, గిరికుమారి, అడిట్ కమిటీ సభ్యులుగా రమణయ్య, సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

### నేడు చేనేత దినోత్సవ ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర అతిథిగృహం నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీని నిర్వహిస్తున్నామని జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ వి. హరిక్రిష్ణ తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 11 గంటలకు ఆప్కోవారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ విజయరామరాజు ప్రారంభిస్తారన్నారు. చేనేత దినోత్సవాన్ని పురష్కరించుకు బారత ప్రధాని నరేంద్రమోదీ చేనేత కార్మికుల గురించి ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని దూరదర్శన్ ద్వారా దేశంలోని 75 క్లస్టర్స్ నుంచి ప్రతి క్లస్టర్ నుంచి 100 మంది చొప్పున చేనేత కార్మికులు హాజరవుతారన్నారు. జిల్లాలోని మోరగుడి, జమ్మలమడుగు నుంచి చేనేత కార్మికలు ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తారన్నారు.

# సాంకేతిక ఒరబడి..



- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో అంతర్జాతీయస్థాయి బోధనలు
- తొలి విడతలో 430 స్కూళ్లలో స్మార్ట్ టీవీలు ఏర్పాటు
- రెండవ దశలో 635 స్కూళ్లకు మంజూరు



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా బోధనలు అందిస్తున్న ఉపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ పాఠశాలలకు రూపురేఖలను మార్చారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో రోజుకో మెనూను అందిస్తున్నారు. మరో అడుగు ముందుకేసి తాజాగా డిజిటల్ బోధన వైపు ప్రభుత్వం దృష్టి సారించింది, ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు, యూపీ, హైస్కూల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీలు) ఏర్పాటు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని విధంగా వినూత్న పద్ధతిలో విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు చర్యలు ప్రారంభించారు. సర్కారీ బడుల్లో డిజిటల్ హంగులను సమకూర్చి అంతర్జాతీయ ప్రమాణాలను కల్పించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు సరికొత్త బోధనలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొదటి విడతలో జిల్లాలో 430 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో 1190 ఐఎఫ్‌పీలు, మరో 530 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధనలను అందిస్తున్నారు.

**రెండో విడతలో...**

డిజిటల్ బోధనకు జిల్లావ్యాప్తంగా రెండోవిడత కింద 635 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు.909 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫానెల్స్‌ను, 736 స్మార్ టీవీలను మంజూరు చేశారు. వీటి ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమైయ్యారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ బోధన ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీలు, మూడు నుంచి పదో తరగతి వరకు ఐఎస్‌పీల ద్వారా బోధిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా బైజ్యూస్ కంటెంట్‌తో అందించారు. స్మార్ట్‌టీవీలకు ఇంటర్‌నెట్ అనుసంధానం చేసి దీని ద్వారా ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్టు చేసి పాఠాలను బోధిస్తున్నారు. వీటిని చూస్తున్న విద్యార్థులు పలు అంశాలను సులభంగా నేర్చుకుంటున్నారు.

| | |
|---|---|
| తొలిదశలో ఐఎఫ్‌పీలు మంజూరైన పాఠశాలలు: | 430 |
| ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ : | 1109 |
| స్మార్ట్ టీవీలు: | 530 |
| రెండో దశలో ఐఎఫ్‌పీలు మంజూరైన పాఠశాలు : | 635 |
| ఏర్పాటు చేయనున్న ఐఎఫ్‌పీలు : | 909 |
| స్మార్ట్ టీవీలు సంఖ్య: | 736 |

విద్యార్థులు అవసరమనుకుంటే ఫైల్ రూపంలో సేవ్ చేసుకుని అవసరం ఉన్నప్పుడు వినే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతర్జాతీయస్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీపడి ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉంటుంది.

**ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ**

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం 5000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పులివెందుల జేఎన్‌టీయూ, చాపాడులోని సీబీఐటి ఇంజినీరింగ్ కళాశాల, కడపలోని కేఎస్ఆర్ఎం, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో వీరికి 14 రోజుల పాటు ఉన్నత విద్యామండలికి చెందిన సబ్జెక్టు నిపుణులతో శిక్షనను ఇచ్చారు.

**ఐఎఫ్‌పీతో ఉపయోగాలు...**

- ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)తో దృశ్య శ్రవణ, ఇంటకార్టివ్‌తో కూడిన 2డి, 3డి యానిమేటర్ కంటెంట్‌ను బోధించడం.
- విద్యార్థికి సులభంగా అవగాహన, కఠినమైన భావనలను సరళీకృతం చేసి అందించే విధంగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు గుండె గురించి విద్యార్థులకు బోధించే సమయంలో నేరుగా గుండె పనిచేసే విధానం, వీడియో, ఆడియో రూపంలో భాగాలు అర్థమయ్యే విధంగా బోధించడానికి ఇంటర్‌నెట్ సహకారంతో విజువల్స్‌తో ఈ పరికరం చూపిస్తుంది.
- ప్రపంచ స్థాయిలో పోటీ పడే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి సహాయపడుతుంది
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే విధంగా నాణ్యమైన విద్యను అందించడానికి బైజ్యూస్‌తో పాటు ఎస్‌సీఈఆర్టీ వారు మంచి పాఠ్యాంశాలను రూపొందించి అందించేందుకు కృషి చేస్తున్నారు.

**జిల్లాలో పాఠశాల వివరాలు**

| కేటగిరి | పాఠశాలలు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|
| ప్రాథమిక | 1642 | 33159 | 33838 | 66997 |
| ప్రాథమికోన్నత | 142 | 7393 | 8041 | 15434 |
| ఉన్నత | 310 | 35083 | 40642 | 75725 |

### డిజిటల్ బోధనతో మంచి ఫలితాలు



డిజిటల్ బోధన వల్ల విద్యార్థులకు సులభంగా అర్థవంతంగా ఉంటుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంతో భవిషత్తులో మంచి ఫలితాలు వస్తాయి, డిజిటల్ బోధన వల్ల విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు వినండంతోపాటు కొత్త అంశాలను నేర్చుకునేందుకు అసక్తిని చూపుతారు.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి

### రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



గోడపత్రాలను విడుదల చేస్తున్న ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

బద్వేలు అర్బన్: ఆగస్టు 21, 22వ తేదీల్లో జరగనున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని అన్నారు. అడగకుండానే 12వ పీఆర్సీ ప్రకటించారని అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు సజ్జలరామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఉద్యోగస్తుల ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు బండిశ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డిలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అమర్‌నాథ్ రెడ్డి, టీ.నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### హార్సిలీహిల్స్‌కు విచ్చేసిన జస్టిస్ లక్ష్మణరెడ్డి

బి.కొత్తకోట: ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదివారం సాయంత్రం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ చేరుకున్నారు. ఆయనకు విడిది ఏర్పాట్లు చేసిన గవర్నర్ బంగ్లా వద్దకు చేరుకోగానే పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

# జోహార్.. గద్దర్

### ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై పలువురి సంతాపం

కడప కల్చరల్: ప్రజా యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్‌కు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతో అనుబంధం ఉంది. ఆయన రెండు మూడు సందర్భాలలో కడప నగరం, పొద్దుటూరు, రాయచోటిలకు వచ్చారు. 1984లో ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రాడికల్ స్టూడెంట్ యూనియన్ సమావేశంలో.. 1985లో నాటి మున్సిపల్ ఉర్దూ హైస్కూల్ పక్కన ఉన్న మున్సిపల్ రంగస్థలంలో జరిగిన రాడికల్ విభజన విభాగం సదస్సులో పాల్గొన్నారు. 1986లో వేంపల్లె,పులివెందులకు వచ్చారు. అలాగే 1991లో రాయచోటిలో పీపుల్స్ వార్ రాజకీయ సమావేశాల్లో పాల్గొన్నారు.విప్లవానికి ప్రతిరూపంగా ఆటపాటతో ప్రజాసమస్యలను ప్రతిబింబించే ప్రజాయుద్ధ నౌకగా గద్దర్‌ను ప్రజలు పిలిచేవారు. జిల్లాలో జరిగే పలు సభల్లో ఆయన అభిమానులైన పలువురు పిల్లగద్దర్‌లు ఆయన వేషం, ఆవేశాలను అనుకరిస్తూ నృత్యాలు చేస్తున్నారు. ఆదివారం గద్దర్ మరణం గురించి జిల్లా ప్రజలకు తెలియగానే ప్రజా కళాకారులు, ప్రజా నాట్యమండలి ప్రతినిధులు, జానపద కళాకారులు, వామపక్ష సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమదైన శైలిలో ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కష్టాలను, కడగండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఆయన చేసిన కృషిని మరువలేమంటూ గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు.



కడపకు వచ్చిన సందర్భంగా గద్దర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాల నాయకులు(ఫైల్)

**మదనపల్లెలో..**

మదనపల్లె: ప్రజా యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్‌కు మదనపల్లెతో విడదీయరాని అనుబంధం ఉంది. పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం జరిగిన రాజ్యాంగ రక్షణ సభ, విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 8న జరిగిన రాజ్యాంగరక్షణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గతంలో జరిగిన మునికృష్ణారెడ్డి అవార్డుల ప్రదానసభలోనూ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన బాస్ వ్యవస్థాపకులు పీటీ ఎం.శివప్రసాద్, ఇతర ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులతో ఆయనకు వ్యక్తిగత పరిచయాలున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గుమ్మడి విఠల్‌రావు అలియాస్ గద్దర్(77) కన్నుమూశారన్న వార్త తెలిసిన వెంటనే పట్టణం శోక సంద్రంలో మునిగిపోయింది.

# స్పోర్ట్స్ హబ్‌గా కడప

- మేయర్ కె. సురేష్‌బాబు
- ముగిసిన ఏపీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- రాణించిన కడప క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం సాయంత్రం టోర్నమెంట్ ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ కడపను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ రిజర్వేషన్ తీసుకువచ్చి వేలాదిమంది క్రీడాకారులకు ఉద్యోగాలు లభించాయన్నారు. కడపలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మించామన్నారు. మరో స్టేడియం కడప నగరంలో ఏర్పాటు చేయడం క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. విద్యాసంస్థల్లో సైతం క్రీడలను తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి అంకమ్మచౌదరి మాట్లాడుతూ కడపలో సీనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చక్కగా నిర్వహించారన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సైతం చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. జిలానీబాషా మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రానున్న టోర్నమెంట్‌లపై దృష్టి సారించి సాధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందుల గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్స్ అధినేత కందుల చంద్ర ఓబులరెడ్డి, ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథరెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి నాగరాజు, వంశీ, పవన్‌కుమార్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారులతో కడప మేయర్ సురేష్‌బాబు తదితరులు

**విజేతల వివరాలు.. (విన్నర్స్.. రన్నర్స్)**

**మిక్స్‌డ్ డబుల్స్:** అబ్దుల్ రెహమాన్(కడప)–ఎల్. మమైక్య (కృష్ణ), కె. సాయిపవన్ (తూ.గో)–రష్మిత (కృష్ణ).
**మహిళల సింగిల్స్:** నవ్య కందేరి (కడప), టి. సూర్యచరిష్మ (కృష్ణ).
**పురుషుల సింగిల్స్ :** కె.సాయిచరణ్ (గుంటూరు), ఎ. వెంకటసాయి హిమదీప్ (ప్రకాశం).
**మహిళల డబుల్స్:** టి.సూర్యచరిష్మ–ఎల్.మమైక్య(కృష్ణ), డి. స్రవంతి–డి.దీపిక (గుంటూరు).
**పురుషుల డబుల్స్:** పి. చంద్రగోపీనాథ్ (గుంటూరు)–కె.సాయిపవన్ (తూ.గో), కె.సాయిరామ్–ఎ. గుణశ్రీకర్ (పశ్చిమగోదావరి).

# నేతన్నకు ఊపిరి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారిన బతుకులు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనుగడ కోల్పోతున్న చేనేత పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జవసత్వాలను నింపుతోంది. అధికారులు తీసుకుంటున్న చర్యల వల్ల చేనేత పరిశ్రమ ప్రస్తుతం గాడిన పడుతోంది. జిల్లాలో 195 చేనేత సంఘాలు ఉన్నాయి. దాదాపు 10 వేల కుటుంబాలు చేనేత మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. 50 ఏళ్లకు పైబడిన 9819 మంది చేనేతలు పెన్షన్ అందుకుంటున్నారు.ఈనెల 7వ తేదీన జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా కథనం

**చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం**

జిల్లాలో జమ్మలమడుగు, మైలవరం, మాధవరం, ప్రొద్దుటూరు, బద్వేలు ప్రాంతాల్లో చేనేతలు ఎక్కువ మంది నివసిస్తున్నారు. 12 వేల కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. టీడీపీ హయాంలో చేనేత పరిశ్రమ మసకబారి పోయింది. ఎలాంటి చేయూత లేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్సార్ నేతన్న నేస్తం కింద చర్యలు చేపట్టారు. చేనేత కార్మికునికి నెలకు రూ. 2000 చొప్పున ఏడాదికి రూ. 24 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. 2023 సంవత్సరానికి సంబంధించి 9144కుటుంబాలకు రూ. 24 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.మగ్గం ఉన్న ప్రతి కార్మికుడుకి 5 విడతలకు గాను రూ.120000.రాష్ట్రప్రభుత్వం అందజేసింది. అలాగే అర్హులైన చేనేత కారులకు ప్రభుత్వం పెన్షన్ కూడా అందజేస్తోంది. అదేవిధంగా వారు తయారు చేసిన బట్టలను నేరుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంనందు అమ్ముటకు గూడ తగిన సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం సదుపాయం కల్పించింది.



మగ్గంపై చేనేత కార్మికురాలు

**చేనేత ఆధునిక బాట**

చేనేతను ఆధునిక బాటలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర సాయంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు పట్టు చీరలు, నూలు చీరలు, బెడ్‌షీట్లు, దోమతెరలు, లుంగీలు, పంచెలు, తువాళ్లు, జంఖానాలు వంటివి నేస్తున్నారు. ప్రస్తుతం సంప్రదాయ వస్త్రాలకే పరిమితం కాకుండా డ్రస్ మెటీరియల్ వంటి వాటిని చేనేతల ద్వారా ఉత్పత్తి చేసేందుకు నైపుణ్యాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం క్లస్టర్‌లను ఏర్పాటు చేసింది. వీటి కింద దాదాపు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ముద్ర రుణాలను కూడా ఇస్తోంది.

**నాడు వైఎస్సార్...నేడు వైఎస్ జగన్...**

చేనేతకారుల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి చేశారు. ఆయన అధికారంలోకి రాగానే చేనేత కార్మికుల అప్పులను మాఫీ చేశారు. 50 ఏళ్ల నిండిన చేనేత కారులకు పింఛన్ సదుపాయం కల్పించిన ఘనత వైఎస్సార్‌దే. అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కారులకు పరిహారం చెల్లించే ప్రక్రియకు కూడా ఆయనే శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఆయన తర్వాత వైఎస్ జగన్ చేనేతకారుల అభ్యున్నతికి పాటుపడుతున్నారు.

- కేంద్ర ప్రభుత్వం బ్లాక్ లెవెల్ హ్యాండ్‌లూమ్ క్లస్టర్లకు శ్రీకారం చుట్టింది. 150–200 మగ్గాలు ఉన్న చేనేత కారులకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి వారికి కొద్దిరోజులు శిక్షణ ఇచ్చి పరికరాలను అందజేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో తిరుమల, శివాలయం నగర్, అప్పనపల్లె, శ్రీనివాస, మైదుకూరు, మోరగుడి క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు క్లస్టర్లకు తిరుమల, శివాలయం నగర్, మోరగుడి బ్లాక్ లెవెల్ క్లస్టర్ల ద్వారా మగ్గాలు, జాకార్డ్‌లను పరికరాలను అందజేశారు. మగ్గానికి రూ. 38 వేలు, జాకార్డుకు రూ. 15 వేలును అందజేశారు.

**ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నేతన్న నేస్తం పథక వివరాలు**

| సంవత్సరం | లబ్ధిదారులు | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019–20 | 11,774 | 28,25,76,000 |
| 2020–21 | 10,774 | 25,85,76,000 |
| 2021–22 | 8636 | 19,76,64,000 |
| 2022–23 | 9179 | 22,02,96,000 |
| 2023–2024 | 9946 | 23,87,04,000 |

జిల్లాలో చేనేత మగ్గాలు : 16000
సంఘాలు: 195
పింఛన్ పొందుతున్న వారు: 9819 మంది
చేనేత కుటుంబాలు: 12,000

### చేనేతల సంక్షేమానికి కృషి



చేనేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అర్హతగల చేనేత కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ. 24 వేలు ఆర్థికసాయం అందజేస్తోంది. కేంద్ర సాయంతో బ్యాంకుల నుంచి ముద్ర రుణాలను ఇప్పిస్తున్నాం. చేనేత వర్గాలు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి.
– హరికృష్ణ, ఏడీ, చేనేత జౌళిశాఖ, కడప

## క్లుప్తంగా

### జేబుదొంగల చేతివాటం

**పోరుమామిళ్ల :** స్థానిక ఆర్టీసీ బస్టాండులోని బస్సులో ఆదివారం మధ్యాహ్నం జేబుదొంగలు చేతివాటం చూపారు. బద్వేలు డిపోకు చెందిన పామూరు వెళ్లే బస్సు బస్టాండులోకి రావడంతో మహిళలు ఒక్కసారిగా లోపలకు ఎక్కేందుకు ఎగబడ్డారు. అదే అదనుగా దొంగలు పర్సులు దోచుకున్నారు. ప్రకాశం జిల్లా సి.యస్.పురం మండలం కంభంపాడుకు చెందిన మహిళ కట్టిలబ్యాగులోని పర్సు కొట్టేశారు. అలాగే పోరుమామిళ్లకు చెందిన ఓ మహిళ చేతిసంచిలోని పర్సు కొట్టేశారు. బస్సు ఎక్కాక సంచుల్లో పర్సులు లేకపోవడంతో వారు లబోదిబోమంటూ కిందికి దిగారు. తన పర్సులో కమ్మలు, హారం, కాళ్లగొలుసులు, మెట్టెలు, డబ్బు తదితర విలువైన వస్తువులు ఉన్నాయని, అన్నీ దోచుకున్నారని కంభంపాడుకు చెందిన మహిళ కన్నీటిపర్యంతమైంది. పోయిన పర్సులో రూ.700 నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయని పోరుమామిళ్ల మహిళ వాపోయింది. గమనించిన కంట్రోలర్ పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి కంభంపాడు మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామన్నారు. పోరుమామిళ్ల మహిళ ఎవరో తెలియదని, స్టేషన్‌కు ఒక్క మహిళ మాత్రమే వచ్చిందని చెప్పారు.

### నూనె మళ్లీ వాడకంపై జరిమానా

**రాయచోటి :** వాడిన నూనెను మళ్లీ వాడిన హోటల్ యజమానులకు రూ.32 వేల జరిమానా విధిస్తూ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తీర్పు వెలువరించారు. అన్నమయ్య జిల్లా జేసీ కోర్టులో శనివారం.. వ్యాపారులు వంట నూనెలను మళ్లీ ఉపయోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై జేసీ తీవ్రంగా స్పందించారు. జిల్లా ఆహార భద్రతాధికారి కె.షమీమ్ బాష ఫిర్యాదు మేరకు ఈ శిక్షను విధించారు. వంట నూనెలను మళ్లీ ఉపయోగించి తయారు చేసిన వంటల వల్ల మనుషులలో చెడు కొలస్ట్రాల్‌గా మారుతుందన్నారు.



# పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

- ఇంటిలోకి చొరబడి చోరీకి యత్నించాడని అనుమానం
- అదుపులోకి తీసుకున్న చిన్నచౌక్ పోలీసులు
- ఉదయం అపస్మారక స్థితిలోకి వెళ్లిన వైనం
- రిమ్స్‌కు తీసుకెళ్లే లోపు మృత్యువాత


చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విచారణ చేస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్


కడప రిమ్స్ మార్చురీలో కప్పా రాజు మృతదేహం

**కడప అర్బన్ :** కడపలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న కప్పా రాజు (45) అనే వ్యక్తి ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసు అధికారులు తెలిపిన వివరాలు, పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా లభించిన సీసీ ఫుటేజీల ఆధారాల ద్వారా తెలిసిన వివరాలిలా వున్నాయి. తూర్పు గోదావరి (ప్రస్తుతం కాకినాడ) జిల్లా ఏలేశ్వరానికి చెందిన కప్పారాజుకు ఆరు నెలల క్రితం మద్యం మాన్పించేందుకు వైద్యసేవలు అందించారు. ఇతని మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ నెల 2న తన గ్రామం నుంచి కడపకు వెల్డింగ్ పని చేసేందుకు బయలుదేరి వచ్చాడని అతని కుమార్తె పోలీసులకు ఇచ్చిన సమాచారం. ఈక్రమంలో కడపకు చేరుకున్న రాజు పనులు చేస్తున్నాడు. ఇక్కడ తిరుపతి, వాసుదేవరాజులు పిలిస్తే తన తండ్రి వచ్చాడని, రెండు రోజుల నుంచి ఆయన ఫోన్ పనిచేయలేదని తెలియజేసింది. ఈనెల 5వ తేదీ (శనివారం అర్ధరాత్రి) చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అశోక్‌నగర్‌లో ఎద్దుల బాబు అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి రాజు గేటు తెరిచాడు. తరువాత ఆ ఇంటి ఆవరణలోని కూలర్‌ను పగులగొట్టాడు. ఈక్రమంలోనే ఇంటి వాకిలిని బలవంతంగా తెరిచాడు. ఇంటివాళ్లు గమనించి యజమానికి ఫోన్ చేశారు. తరువాత జనాలు గుమికూడి డయల్ 100కు 1:20కి కాల్ చేశారు. బ్లూకోల్ట్స్ 10కు సంబంధించిన పోలీసులు 1:26కు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతన్ని చిన్నచౌక్ పోలీసులకు అప్పగించారు. పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. రాజు తనది నెల్లూరని, మతిస్థిమితం సరిగాలేని విధంగా ప్రవర్తించాడు. తరువాత అతనికి నీళ్లు ఇచ్చారు. రాత్రి పోలీస్‌స్టేషన్‌లోనే నిద్రించాడు. లాకప్‌లో ఉన్న రాజు ఉదయం 8:51 గంటలకు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 9:20కి గమనించిన మహిళా కానిస్టేబుల్.. మరో కానిస్టేబుల్‌కు తెలియజేసింది. విధుల్లో ఉన్న సిబ్బంది వచ్చి రాజుకు సీపీఆర్ చేశారు. తరువాత వెంటనే ఆర్ఎంపీని పిలిపించి ప్రథమ చికిత్స అందించారు. వెంటనే ఆటోలో కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే రాజు మృతి చెందాడని రిమ్స్ వైద్యులు నిర్ధారించారు. అతని ప్యాకెట్‌లో దొరికిన ఐడీ, ఆధార్ కార్డుల ఆధారంగా చిరునామాను గుర్తించారు. అతని కుమార్తె రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. ఆయన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అతని బంధువులు వచ్చిన తరువాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలియజేశారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పరిశీలించారు. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీరామ శ్రీనివాసులు, ఎస్‌ఐ రవికుమార్, సిబ్బందిని విచారణ చేశారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ మార్చురీలో ఉంచారు.

**అనారోగ్యంతో మృతి : డీఎస్పీ**

చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న మతిస్థిమితం లేని కప్పా రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని డీఎస్పీ ఎం.డి. షరీఫ్ తెలిపారు. కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న రాత్రి అశోక్‌నగర్‌కు చెందిన ఎద్దుల బాబు డయల్ 100కు ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తలుపు బలవంతంగా తీసి చొరబడేందుకు ప్రయత్నించాడని పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. అతన్ని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారని, నైట్ డ్యూటీలో వున్న సీఐ శ్రీరామశ్రీనివాసులు వచ్చి విచారణ చేశారని పేర్కొన్నారు. రాజు ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌లో అపస్మారక స్థితిలో వుండగా మహిళా కానిస్టేబుల్ గమనించి సిబ్బందికి తెలియజేసిందన్నారు. తరువాత వారు ఆర్ఎంపీని పిలిపించి చూపించారన్నారు. తరువాత రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు. పోలీస్‌స్టేషన్‌లో చనిపోవడంతో కస్టోడియల్ డెత్ కింద ఆర్డీఓ ద్వారా బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించేందుకు సిఫారసు చేశామన్నారు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు సమగ్రంగా విచారణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో కడప రిమ్స్ సీఎస్ సీఐ రామచంద్ర, చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

**రాజంపేట :** నందలూరు మండలం చింతలకుంట గ్రామానికి చెందిన పప్పు వెన్నెల కుటుంబానికి ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసింది. ఓబులవారిపల్లె మండలం కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని చిన్నఓరంపాడు వద్ద గత నెలలో బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో వెన్నెల తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం మేడా భవన్‌లో మృతురాలి తండ్రి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి, మృతి చెందిన వారి కుటుంబాలకు వెనువెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందన్నారు. ఆడపూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మకు రూ.2 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి మల్లికార్జునరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నందలూరు ఆర్‌ఐ సుశీల్ పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన జోనల్ మ్యాచ్


సుతేజ్, 100 పరుగులు


క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్టు డ్రాగా ముగిసింది. చివరి రోజు ఆదివారం 324 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 108.1 ఓవర్లలో 463 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నయీముల్లా 62, సుతేజ్‌రెడ్డి 100 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ ఆదిత్యరెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. జట్టులోని ఆనంద్ 53 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు అర్జున్‌టెండూల్కర్ 1, ప్రదీప్‌రెడ్డి 1 వికెట్ తీశారు. దీంతో ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా సౌత్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 154 పరుగులు చేయగా, సెంట్రల్‌జోన్ జట్టు 311 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో సెంట్రల్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### బైక్‌ను ఢీకొన్న లారీ

**–వ్యక్తి మృతి**

**రాయచోటి టౌన్ :** బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు దగ్గర విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా బారికేడ్లు దాటుకొని బైక్‌పై రోడ్డుపైకి వస్తుండగా.. చిత్తూరు రోడ్డు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన యం.వెంకటరమణ(48) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హ్యాండ్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పోతుల వెంకటరామిరెడ్డి

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ విభాగం ఎంపికలకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి విచ్చేసి ఈ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.ఎన్.సమరనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి విజేతలుగా నిలుపుతాయన్నారు. జియోన్ వ్యాయామ కళాశాల చైర్మన్ రాజారత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి క్రీడా సంఘాలు కృషి చేయాలని సూచించారు. ఏపీ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న హ్యాండ్‌బాల్ సంఘం కృషిని అభినందించారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కోశాధికారి రవీంద్రనాథ్, కె.సంజీవరెడ్డి, హ్యాండ్‌బాల్ శిక్షకుడు అబ్దుల్‌మునాఫ్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, బసిరెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

### చేనేతలను సత్కరించడం అభినందనీయం


చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న తొగటవీర క్షత్రియ సేవా సంఘం నాయకులు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికులను సత్కరించడం అభినందనీయమని తొగట వీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో 73 మంది చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత పెద్ద కుటీర పరిశ్రమైన చేనేత రంగం దేశ సంస్కృతి, వైభవాలకు ప్రాణం పోసిందన్నారు. ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకొని, వారి సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. విస్తృతమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అనంతరం ముద్ర డ్యాన్స్ అకాడమి చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చేనేత కార్మికుడి చిత్రంతో కూడిన ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు బండారు రఘురామయ్య, బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, గోవిందు నాగరాజు, బొమ్మల వెంకట రత్నం, సీఆర్‌ఐ సునీల్ జయంత్, నారాయణస్వామి, సుధాకర్, సుబ్బరాయిడు, లక్ష్మినారాయణ, చౌడం సూరిబాబు, వెంకట నారాయణ, నాగార్జున, డాక్టర్ పట్టెం ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

### అటవీ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

**బి.కొత్తకోట :** రాష్ట్ర అటవీ శాఖలో 2 వేలకుపైగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు కోరారు. హార్సిలీహిల్స్‌పై ఆదివారం ఆ సంఘం రాయలసీమ జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా పదోన్నతులు జరగలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొండపై ప్రకృతి అధ్యయన కేంద్రంలో తొమ్మిది జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులకు సమావేశం నిర్వహించారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్‌యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి విమల్, కోశాధికారి కె.సురేష్, జిల్లాల అధ్యక్షులు కె.ప్రతాప్, కార్యదర్శి సుధాకర్ (అన్నమయ్య), ఎం.మల్లికార్జున (అనంతపురం) ఎస్.పిచ్చిరెడ్డి (నెల్లూరు), డి.నాగరాజు (కడప), సి.విజయభాస్కర్‌రెడ్డి (కర్నూలు), ఓ.రేష్మిరెడ్డి (నంద్యాల), సయ్యద్ మగ్బూల్ (ఆత్మకూరు), ఎం.జనార్దన్ (రాజంపేట), చినబాబు (తిరుపతి) పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పోటీల్లో రాణించిన రైతుబిడ్డ


ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఇండియా, ఎమిరేట్స్ జట్లు


దిలీప్‌ను పతకంతో సత్కరిస్తున్న దుబాయ్ షేక్

**పోరుమామిళ్ల :** అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన రైతు బిడ్డ రాణించాడు. దుబాయ్‌లో శనివారం ఇండియా, అరబ్ ఎమిరేట్స్‌కు జరిగిన ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ ఫైనల్ పోటీలో ఇండియా రెండో స్థానంలో నిలిచింది. అరబ్ ఎమిరేట్స్ గెలుపొందింది. ఈ పోటీల్లో పోరుమామిళ్ల మండలం యరసాల గ్రామానికి చెందిన రైతు బిడ్డ దిలీప్‌కుమార్‌రెడ్డి సత్తా చాటాడు. జట్టులో కీలకపాత్ర పోషించాడు. దిలీప్‌కుమార్‌రెడ్డి నెల్లూరులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ అక్కడే చిట్టిబాబు అకాడమీలో ఫుట్‌బాల్ క్రీడలో కోచింగ్ తీసుకున్నాడు. 2023 మే 26, 27, 28 తేదీల్లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (యస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం లభించింది. అండర్–19 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో 13 రాష్ట్రాలు పాల్గొన్నాయి. ఆ పోటీల్లో దిలీప్‌కుమార్‌రెడ్డి చక్కని ప్రతిభ చూపి, జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. జూలై 30 నుంచి ఆగస్టు 5 వరకు దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ పోటీల్లో పాకిస్తాన్, శ్రీలంక, మాల్దీవులు, కెన్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండియా పాల్గొన్నాయి.

ఇండియా, అరబ్ ఎమిరేట్స్ ఫైనల్‌కు వచ్చాయి. శనివారం రెండు జట్లు ఫైనల్లో తలపడగా ఇండియా సెకండ్ ప్లేస్‌లో నిలిచింది. ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ క్రీడలో కడప జిల్లా రైతు బిడ్డ ప్రతిభ చూపడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దిలీప్ తండ్రి శేఖర్‌బాబురెడ్డి యరసాలకు చెందిన సామాన్య రైతు. రైతు బిడ్డగా ఫుట్‌బాల్ క్రీడలో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం రాష్ట్రానికే గర్వకారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా కడప జిల్లా యువకుడు దుబాయ్‌లో సత్తా చూపడంపై అందరూ గర్వపడాలి.

# చంద్రబాబును మొదటి ముద్దాయిగా చేర్చాలి

- పుంగనూరు ఘటనను నిరసిస్తూ ధర్నా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**ప్రొద్దుటూరు :** ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన సంఘటనలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును మొదటి ముద్దాయిగా చేర్చాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే తాను దీక్షలకు ఉపక్రమిస్తానని అన్నారు. పుంగనూరులో జరిగిన సంఘటనను నిరసిస్తూ ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతపట్టుకుని పోలీసులు జిందాబాద్, చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణంగా ఉన్నత స్థాయిలో ఉన్న నాయకులు తమ పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్‌ను ఇస్తే పోలీసులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారన్నారు. ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు నాయుడు రూట్ మ్యాప్‌ను కాదని మరో మార్గంలోకి వెళ్లారన్నారు. పథకం ప్రకారం ఆయన పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి ప్రజలను భయభ్రాంతులను చేయడంతోపాటు పోలీసులపై దాడి చేయించారన్నారు. సాధారణంగా సంఘటన జరిగి ఉంటే అక్కడికి అన్‌లైసెన్స్ తుపాకి, బీరు బాటిళ్లు, కట్టెలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. జరిగే నష్టాన్ని గుర్తించి పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపకుండా దెబ్బలు తిన్నారన్నారు. 74 ఏళ్ల వయసు ఉన్న, 14 ఏళ్లు సీఎంగా పరిపాలన చేసిన, 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొంటున్న చంద్రబాబు ఇలా చేయడం పద్ధతేనా అని అన్నారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. చంద్రబాబు చేస్తున్న పర్యటనలను ఎవరూ అడ్డుకోలేదని, అయితే ఉద్దేశపూర్వకంగానే ఆయన రెచ్చగొట్టే విధంగా మాట్లాడి సభలను హైలెట్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తరిమికొట్టండి రా నా కొడుకులను అని మాట్లాడటం సబబేనా అని ప్రశ్నించారు. అక్కడి ఎస్పీని సైతం బెదిరించేలా మాట్లాడటం జరిగిందన్నారు. నీలాంటి వారు ఎందరో నా దగ్గర పని చేశారని చంద్రబాబు మాట్లాడటాన్ని విమర్శించారు. ఎస్పీలు ప్రభుత్వంలో పని చేస్తారు కానీ, నీ వద్ద పని చేయడానికి వారు గుమస్తాలు కాదని తెలిపారు. పైగా అడ్డం వస్తే పైకి పోతారని మాట్లాడటం దేనికి నిదర్శనమని అన్నారు. బజారు రౌడీలా, చిల్లర మనిషిలా ఒక మాజీ ముఖ్యమంత్రి వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. పోలీసులు కాల్పులు జరిపి ఇంకా ఎక్కువ నష్టం జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. పదవీ వ్యామోహంతో చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, గోపవరం సర్పంచ్, ఉప సర్పంచ్ మోగా, రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాం రెడ్డి, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఉప్పర మురళి, చౌడం రవిచంద్ర, ఉమామహేశ్వరి, తుపాకుల వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా పాల్గొన్నారు.

### కుట్రలకు కేరాఫ్ ప్రతిపక్షనేత

**సంబటూరు ప్రసాద్‌రెడ్డి**

**కడప కార్పొరేషన్ :** కుట్రలు, కుతంత్రాలకు మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పిల్లనిచ్చిన మామను, సొంత తమ్ముడిని వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ఇతరుల గురించి విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. అధికారం కోసం ఏ గడ్డి కరిచేందుకైనా బాబు సిద్ధమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందేందుకు వేసిన పన్నాగం వల్లే అంగళ్ల వద్ద అల్లర్లు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి మేలు చేస్తుంటే ప్రజలకు దూరమైన చంద్రబాబు ఓర్వలేక ఫ్రస్టేషన్‌తో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన చేస్తున్నది ప్రాజెక్టుల సందర్శన కాదని, దండయాత్ర అన్నారు. పులివెందులలో ఎంత రెచ్చగొట్టినా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కార్యకర్తలను సంయమనం పాటించేలా చేశారన్నారు. చంద్రబాబు తమ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారని, ఇందుకు వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.